సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 21 । అక్టోబర్ । 2024



అనుమానిత ఇళ్లల్లో సోదాలు

అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికల కట్టడికి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 8లో



ఓపెన్ విద్య.. అంతా మిథ్య

జిల్లాలో సార్వత్రిక విద్య మిథ్యగా మారింది. పాస్ గ్యారెంటీ పేరుతో స్టడీ సెంటర్ల నిర్వాహకులు డబ్బులు వసూలు చేస్తున్నారు. 8లో



భారత్ నివేష్ రన్‌కు స్పందన

ఏఎంఎఫ్ఐ ఆధ్వర్యంలో మ్యూచువల్ ఫండ్స్‌పై అవగాహన పెంచేందుకు బీచ్‌రోడ్డులో భారత్ నివేస్ రన్ జరిగింది. 8లో

న్యూస్‌రీల్

రోల్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు విశాఖ క్రీడాకారులు


రోల్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మురళీనగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన రోల్‌బాల్ పోటీల్లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం నుంచి ఈ రెండు విభాగాల్లో 24 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సతీష్ చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్క్ కార్యదర్శి సూర్యనారాయణ రాజు, విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి తోట లలిత ప్రియ, కోచ్ పూసర్ల సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విశాఖ- రాయపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల కోరిక మేరకు విశాఖపట్నం -రాయ్‌పూర్ పాసింజర్ వేళల్లో మార్పులు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మారిన వేళలు ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయి. విశాఖపట్నం–రాయ్‌పూర్(08528) పాసింజర్ స్పెషల్ ప్రతి రోజూ ఉదయం 6.30 గంటలకు బదులుగా ఉదయం 4.25 గంటలకు విశాఖలో బయలుదేరుతుంది. ప్రతి రోజూ రాత్రి 7.45 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటి లయ



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం సినీ నటి లయ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ ప్రసాద్ అందజేశారు.

జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మద్దిలపాలెం: విశాఖ జిల్లా యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక ఆదివారం శివాజీ పాలెం సవేరా ఫంక్షన్ హాల్ జరిగింది. జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం, అధ్యక్షుడిగా ఒమ్మి సన్యాసి రావు, సెక్రటరీగా బొట్ట వెంకటరమణ, కోశాధికారిగా పిట్ట సురేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి నాడు రాధాకృష్ణుల మహోత్సవాలు నిర్వహించేందుకు తీర్మానం చేశారు. ఈ ఎన్నికకు పరిశీలకులుగా గొలగాని అప్పారావు, గొంప అప్పారావు, ప్రగడ చిన్నారావు వ్యవహరించారు.

బార్లలో పోలీసుల తనిఖీలు

మహారాణిపేట: నగరంలో పలు బార్లు/పబ్‌ల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ జారీ చేసిన లైసెన్స్, ఫుడ్ లైసెన్స్, ఫైర్ ఎన్‌వోసీ, ట్రేడ్ లైసెన్స్, పార్కింగ్ ప్రదేశం, సీసీటీవీ కెమెరాలు, చిన్నారులు విధుల్లో ఉన్నారా? వంటి వాటిపై తనిఖీలు చేపట్టారు. ఎమ్మార్పీకి మద్యం విక్రయిస్తున్నది లేనిది పరిశీలించారు. రెండు బార్/పబ్‌లకు ఫైర్ ఎన్‌వోసీ, ఫైర్ పరికరాలు లేవని పోలీసులు నిర్ధారించారు. ఒక పబ్/బార్‌కు పార్కింగ్ స్థలం లేదని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినా చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ బాగ్చి తెలిపారు.

మహిళా కళాశాలలో జాబ్‌మేళా నేడు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. జాబ్‌మేళాలో తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్ ఇన్నోసోర్స్, ఎస్‌బీఐ కార్డ్స్, డీమార్ట్ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9966965502 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

అమరం.. స్మరణం


గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పోలీస్ అంటే ఒక ధైర్యం. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న త్యాగాలు వెలకట్టలేనివి. సోమవారం పోలీస్ అమర వీరుల స్మృతి దినోత్సవం. కర్తవ్య నిర్వహణలో అశువులు బాసిన పోలీసులకు నివాళులర్పించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. బీచ్‌రోడ్డులో జరిగే ఈ కార్యక్రమ సన్నాహాలను ఆదివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. – ఏయూక్యాంపస్


స్థూపం వద్ద అమరవీరులకు నివాళి అర్పిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

సంద్రం ఆనందం



సాగరతీరం ఆదివారం కిటకిటలాడింది. పిల్లాపాపలతో కలసి నగరవాసులు ఆర్.కె.బీచ్‌కు తరలివచ్చి ఆనందంగా గడిపారు. సముద్రంలో స్నానాలు చేస్తూ కొందరు, రాళ్లపై నిల్చొని ఫొటోలకు ఫోజులిస్తూ మరికొందరు దర్శనమిచ్చారు. వాయుగుండం ఫలితంగా కొద్ది రోజుల కిందట సముద్రం ముందుకొచ్చింది. ఈ ఆదివారం మాత్రం సముద్రం కాస్త వెనక్కి వెళ్లడం, కెరటాల తీవ్రత తగ్గడంతో రాళ్లు కనిపించాయి. వీటి మధ్యలో చిన్న చేపలు కదులుతూ సందడి చేశాయి. వీటిని చూడటానికి, పట్టుకోవడానికి నగరవాసులు ఉత్సాహం చూపారు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో సేదతీరారు. బీచ్ ఫొటోగ్రాఫర్లకు, చిరు వ్యాపారులకు చేతినిండా పని దొరికింది. – ఏయూక్యాంపస్

సాయంకాలం.. చదువుల తీరం!

- విశాఖలోని 'గైస్'లో డిప్లమో కోర్సులకు అవకాశం
- మరో రెండు ప్రయివేటు కాలేజీలకూ సాయంకాలం కోర్సులకు అనుమతి
- పదోన్నతులు పొందాలనుకున్న వారికి అరుదైన అవకాశం

మురళీనగర్(విశాఖ ఉత్తర) : పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేస్తున్న వారు పదోన్నతులు పొందేందుకు గాను తమ విద్యార్హతలను పెంచుకునే అవకాశం లభిస్తే.. భలే ఉంటుంది కదూ. డిప్లమో కోర్సులను సాయం కాలం చదివే అరుదైన అవకాశం విశాఖ నగరంలోని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇనిస్టిట్యూట్(గైస్) అందిస్తోంది. రాష్ట్రంలో 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలుండగా సాయంకాలం కోర్సులు నిర్వహణకు విశాఖలోని గైస్‌ను ఏఐసీటీఈ ఎంపిక చేయడం విశేషం. అలాగే మరో రెండు ప్రయివేట్ పాలిటెక్నిక్ కళాశాలలు.. బెహరా(నరవ), ప్రశాంతి(అచ్యుతాపురం)లలోనూ సాయంత్రం కోర్సుల నిర్వహణకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతిచ్చింది.

వచ్చే నెల ఒకటి నుంచి తరగతులు

కెమికల్ ఇంజినీరింగ్, పెట్రో కెమికల్స్, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ విభాగాల్లో వర్కింగ్ ప్రొఫెషనల్స్‌గా 2024–25 విద్యా సంవత్సరంలో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ మేరకు కోర్సులను నవంబర్ 1న ప్రారంభిస్తారు. ప్రతి కోర్సులోనూ



కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(కంచరపాలెం)

33 సీట్లుండగా.. వీటిలో 3 ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి ఉంటాయి. వీరు ఈ నెల 21 నుంచి 26వ వరకు సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే బెహరా పాలిటెక్నిక్ కాలేజీలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజీ(అచ్యుతాపురం)లో సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నారు.

టైమింగ్స్

రోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9 గంటల వరకు, ఆదివారం, సెలవు దినాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 వరకూ తరగతులు నిర్వహిస్తారు.

ఫీజు వివరాలు: సెమిస్టర్‌కు రూ.18 వేలు

అర్హత

గుర్తింపు పొందిన పరిశ్రమల్లో, లేదా కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో, ప్రభుత్వ లేదా ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇంటర్ ఎంపీసీ/ బైపీసీ/ఐవీసీ/లేదా ఐటీఐ సర్టిఫికెట్‌తో కెమికల్ ప్లాంట్ మెయింటెనెన్స్ మెకానిక్/అటెండెంట్ ఆపరేటర్, లేబొరేటరీ అసిస్టెంట్/ ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ తదితర విభాగాల్లో కనీసం ఏడాది రెగ్యులర్ ఉద్యోగిగా పని చేస్తూ.. పై మూడు కళాశాలకు 50 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తి గలవారు ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ నెల 30న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

ఇదొక సదావకాశం



సాయంకాలం కోర్సుల్లో చేరడం గొప్ప సదావకాశంగా భావించాలి. పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేస్తున్నవారు ఈ కోర్సుల్లో చేరి పదోన్నతులు పొందొచ్చు. ప్రభుత్వం పాలిటెక్నిక్ కాలేజీల్లో గైస్‌కు ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు.

– డాక్టర్ కె.వెంకరమణ, ప్రిన్సిపాల్, గైస్, కంచరపాలెం

ఇదేనా మహిళలకిచ్చే రక్షణ?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన భూపేష్‌నగర్ వాసులు
- ఇప్పటికే రెండు మద్యం షాపులు, రెండు బార్లు
- ఇంకెన్ని పెడతారని అధికారులను నిలదీత
- మద్యం షాపు వద్దని స్పష్టీకరణ


ఆందోళన చేస్తున్న భూపేష్‌నగర్ వాసులు

అల్లిపురం: తమ ప్రాంతంలో మద్యం షాపు వద్దని భూపేష్‌నగర్ మహిళలు ఆందోళన కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి వీరు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం ఉదయమే టెంట్ వేసి, బ్యానర్ కట్టి నిరసన చేపట్టారు. ఇక్కడ మద్యం షాపు తెరవనివ్వమని హెచ్చరించారు. ఇప్పటికే ఉన్న రెండు మద్యం షాపులు, రెండు బార్లకు ఎక్కడెక్కడ నుంచో వచ్చి ఇక్కడే తాగి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మద్యం షాపు తెరిస్తే మా పరిస్థితి మరింత ఘోరంగా మారుతుందని ఆవేదన చెందారు. ఒక పక్క గుడి, మసీదు, మరోపక్క పాఠశాల ఉందని, మద్యం దుకాణం పెట్టడం వల్ల స్థానికులతో పాటు విద్యార్థులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఈ సమాచారం అందించామని.. కానీ ఆయన ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. అధికారులు పునరాలోచించి ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేయించవద్దని.. ఉన్న వాటిని తరలించాలని డిమాండ్ చేశారు.

ఆకతాయిలతో ఇబ్బందులు



చాలా ఏళ్లుగా భూపేష్‌నగర్‌లో కుటుంబంతో జీవిస్తున్నాం. మా ఇంటికి వెళ్లడానికి ఒక్కటే దారి ఉంది. ఇప్పటికే ఇక్కడ ఆకతాయిలు, మద్యం తాగిన వారితో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు కొత్తగా మరో షాపు దారి పక్కన పెట్టడం వల్ల చాలా నష్టం జరుగుతుంది. దుకాణం ఏర్పాటు చేయవద్దు.

– మేరీ, భూపేష్‌నగర్

ఉన్నవి చాలవా.. మరొకటా?



ఈ ప్రాంతంలో ఇప్పటికే నాలుగు మద్యం దుకాణాలు ఉన్నాయి. మరొకటి ఈ ప్రాంతంలో వద్దు. ఇప్పటికే ఉన్న షాపుల్లో తాగి వచ్చి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. మళ్లీ మరొకటి.. అది కూడా మా ఇళ్లకు వెళ్లే దారిలో పెడతామంటున్నారు. ఆకతాయిలు బెడద ఇంకా పెరిగిపోతుంది. మాకొద్దీ వైన్ షాపు.

– పి.పద్మ, భూపేష్‌నగర్

మహిళలకు రక్షణ లేదు



మద్యం దుకాణాల వల్ల ఈ ప్రాంతంలో ఆడ పిల్లలకు రక్షణ లేకుండా ఉంది. ఉన్న వైన్ షాపులు చాలవన్నట్లు మరొకటి పెడతామంటున్నారు. దీని వల్ల మందుబాబుల బెడద పెరిగిపోతుంది. ఇక్కడికి దగ్గరలోనే మసీదు, స్కూలు ఉంది. పిల్లల భవిష్యత్‌ను మద్యం షాపులు పెట్టి పాడు చేయవద్దు. ప్రభుత్వం పునరాలోచించాలి.

– ఎస్.కె.మెహబూబ్, భూపేష్‌నగర్

వారే గద్దర్ అసలైన వారసులు

గద్దర్ సంస్మరణ సభలో ఆయన కుమార్తె వెన్నెల

సీతంపేట: ప్రభుత్వాలనే గడగడలాడించిన చరిత్ర గద్దర్ పాటకు ఉందని ఆయన కుమార్తె వెన్నెల అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం 'గద్దరన్న యాదిలో' పేరుతో జరిగిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. సామాన్య, పేద, మధ్య తరగతి వర్గాల కోసం నాన్న ఎన్నో పాటలు రాశారని.. ఆయన జీవించినంత కాలం పాట కోసమే బతికారన్నారు. ఆయన రాసిన పాటలు అనేక ఉద్యమాలకు ఊపిరి పోసాయని, అటువంటి గొప్ప వ్యక్తిని మననం చేసుకోవడంలో కళాకారులు ఎప్పుడూ ముందుంటారన్నారు. గద్దర్ పాటలు వినే వారు, ఆయన పాటలతో స్ఫూర్తి పొందిన వారు, ఆయన పాటలతో పయనిస్తున్న కళాకారులే గద్దర్ వారసులని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాకారులతో కలిసి గద్దర్ పాటలు పాడి ఆడి ఉత్సాహపరిచారు. ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ మాట్లాడుతూ గద్దర్ రాసిన పాటలు వింటే రక్తం మరుగుతుందన్నారు. పాటల తూటా ఉదయ్ భాస్కర్ గద్దర్ పోరాట స్ఫూర్తిని, సాహిత్యాన్ని, పాట విశిష్టతను గుర్తు చేస్తూ పాడే విధానం కంటతడి పెట్టించింది. బానిసలారా లెండిరా, ఈ బానిస బతుకులు వద్దురా పాట స్ఫూర్తిని రగిలించింది. స్టీల్ పరిరక్షణకు దర్శకుడు సత్యారెడ్డి రూపొందించిన 'ఉక్కు సత్యాగ్రహం' సినిమా పోస్టర్లను ఈ సందర్భంగా వెన్నెల ఆవిష్కరించారు. ఉత్తరాంధ్రకు చెందిన పలువురు మేధావులు, ఉద్యమ సంస్థలు, ప్రజా సంఘాల ప్రతినిధులు గద్దర్ పోరాట స్ఫూర్తి, పాటల గొప్పతనాన్ని వివరించారు. డాక్టర్ అర్జున, గంటా మోహనరావు, వంగపండు దుష్యంత్, అవాల రమేష్, బొడ్డు కల్యాణరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గద్దర్ కుమార్తె వెన్నెల

మా కాలనీలో వైన్ షాపు వద్దు

మధురవాడ: తమ కాలనీలో వైన్‌షాపు వద్దంటూ కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని మధురవాడ మిథిలాపురి వుడాకాలనీ వద్ద గల వికలాంగుల కాలనీ వాసులు అన్నారు. ఇప్పటికైనా చలించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మహిళలు, కాలనీ పెద్దలు వైన్ షాపు వద్ద ఆందోళన చేపట్టారు. తమ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోని అధికారులు.. వద్దంటున్నా వైన్ షాపు కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. మందుబాబులు ఇక్కడే మద్యం సేవించి తమ ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించి వ్యాపారం చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్‌పై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ వైన్‌షాపు వేరే ప్రాంతానికి తరలించాలని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కాలనీ అధ్యక్షుడు కె.ఎస్.ప్రసాద్, కార్యదర్శి తమ్మినేని వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ బి.అనిల్, కాలనీ పెద్దలు జి.వీరాచారి, భూపాల్, ప్రసాద్, హరిదేవి, రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.


మధురవాడ వికలాంగుల కాలనీలో వైన్ షాపు వద్ద ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తాం..

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి నియామకంపై హర్షం



డాబాగార్డెన్స్: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన రాజ్యసభ సభ్యుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి, విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సారథ్యంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణతో కలిసి జియ్యాని శ్రీధర్ మాట్లాడారు. పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్‌గా విజయసాయిరెడ్డి నియామకం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అందరికీ అందుబాటులో ఉండే విజయసాయిరెడ్డి సారథ్యంలో పార్టీ క్షేత్ర స్థాయిలో మరింత పటిష్టం అవుతుందని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ ఉద్యమం, జీవీఎంసీ ఎన్నికల్లో పార్టీ విజయంలో విజయసాయిరెడ్డి కృషి ఎంతో ఉందని తెలిపారు. అలాగే ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల తరఫున పోరాడేందుకు, పార్టీని ముందుండి నడిపించేందుకు నూతనంగా నియమితులైన రీజనల్ కోఆర్డినేటర్లు, పార్టీ జిల్లాల అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ మాట్లాడుతూ రాబోవు ఏ ఎన్నికకైనా వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. రెడ్‌బుక్ ద్వారా టీడీపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. 2019 ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో వైఎస్సార్ సీపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించడంలో విజయసాయిరెడ్డి పాత్ర కీలకమన్నారు. క్లిష్ట సమయంలో క్యాడర్‌కు అండగా ఉంటారని తెలిపారు.

మెదడు ఆరోగ్యంపై అవగాహన అవసరం

ముగిసిన న్యూరాలజీ సదస్సు


సీపీ బాగ్చికి జ్ఞాపిక అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: నగరంలో జరుగుతున్న ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ–2024 సదస్సు ఆదివారంతో ముగిసింది. సదస్సులో భాగంగా ఆర్.కె.బీచ్‌లో 'రన్ ఫర్ ది బ్రెయిన్' పేరుతో 5కె రన్ నిర్వహించారు. ఈ మారథాన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి జెండా ఊపి ప్రారంభించారు. దాదాపు 300 మంది వైద్యులు ఈ మారథాన్‌లో పాల్గొని మెదడు ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీకి నిర్వాహకులు జ్ఞాపిక బహూకరించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు, నిర్వాహక కార్యదర్శి ఎస్.గోపి, ప్రముఖ న్యూరాలజిస్టులు కె.వెంకటేశ్వర్లు, వై.ప్రభాకరరావు, ఎం.మధుసూదనబాబు, కె.సత్యారావు, కిశోర్, సుష్మ, తదితరులు పాల్గొన్నారు. సదస్సులో భాగంగా మొత్తం 26 సింపోజియంలు, 18 బ్రేక్‌ఫాస్ట్ సెషన్లు, 24 పోస్టర్ సెషన్లు నిర్వహించారు. తొమ్మిది అవార్డు పేపర్‌లను సమర్పించారు. దేశవిదేశాల నుంచి సుమారు రెండు వేల మంది వైద్య నిపుణులు సదస్సులో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. మెదడు ఆరోగ్యం, నరాల సంబంధిత రుగ్మతల నివారణ, స్ట్రోక్, మైగ్రేన్, ఎపిలెప్సీ వంటి వ్యాధులపై విస్తృతంగా చర్చించారు. ఈ వ్యాధుల నిర్వహణలో ఆధునిక పరికరాలు, చికిత్స పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించారు. 2025లో వారణాసిలో జరగనున్న సదస్సు జెండాను అందజేశారు. సదస్సును విజయవంతం చేసిన అందరికీ డాక్టర్ జి.బుచ్చిరాజు, డాక్టర్ ఎస్.గోపి కృతజ్ఞతలు తెలిపారు.

చైన్‌స్నాచర్.. కేరాఫ్ కంచరపాలెం

- ఒంటరి మహిళలే లక్ష్యంగా గొలుసు దొంగతనాలు
- శ్రీకాకుళంలో చోరీ చేసి మెరుపు వేగంతో విశాఖకు పరారీ
- రాష్ట్ర వ్యాప్తంగా 30 చోరీల్లో కీలక నిందితుడు
- 8.5 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద, నిందితుడితో వన్‌టౌన్ పోలీసులు

శ్రీకాకుళం క్రైం: ఒంటరిగా రోడ్డుపై వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటాడు.. ఆమె పక్క నుంచే బైక్ పోనిచ్చి.. రన్నింగ్‌లోనే మెడలో చైన్‌లు తెంపేస్తాడు.. మరుక్షణమే 100 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో ఘటనాస్థలి నుంచి చెక్కేస్తాడు.. ఇదీ విశాఖపట్నం కంచరపాలేనికి చెందిన భీమరశెట్టి కమల్‌నాథ్ చైన్‌స్నాచింగ్ తీరు. రాష్ట్ర వ్యాప్తంగా 30 చోరీల్లో కీలక నిందితుడైన అతడు పదిసార్లు కటకటాల్లో మగ్గాడు. విడుదలైన వారం రోజుల్లోనే మూడు జిల్లాల్లో నాలుగు చోరీలు చేసి శ్రీకాకుళం పోలీసులకు చిక్కాడు. శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిందితుడి నుంచి ఎనిమిదిన్నర తులాల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే..

చోరీలివే..

కమల్‌నాథ్ 2023 ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు విషయంలో అరెస్టయ్యి 11 నెలలు విశాఖపట్నం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవించి ఈ ఏడాది అక్టోబర్ 4న విడుదలయ్యాడు. అక్టోబరు 6న తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కాత్రావులపల్లి, సీతానగరం గ్రామాల మధ్య స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలో మంగళ సూత్రం (16.6 గ్రాములు) తెంచేశాడు. అదేరోజు బిక్కవోలులో రోడ్డు వెంబడి నడుస్తున్న మహిళ మెడలో చైన్(రోల్డ్ గోల్డ్) చోరీ చేశాడు. అదే రోజు విజయనగరం జిల్లా డెంకాడ పీఎస్ పరిధి రఘుమండ గ్రామ కూడలి వైఎస్సార్‌కాలనీ వద్ద ద్విచక్రవాహనంపై వెనుక కూర్చుని ఉన్న మహిళ మెడలో రెండున్నర తులాల పుస్తెల తాడు తెంచి పరారయ్యాడు. అది కూడా రోల్డ్ గోల్డ్ కావడం గమనార్హం. అక్టోబరు 11న అరసవల్లి దేవాలయం వైపు వెళ్లి స్కూటీపై ఒంటరిగా వస్తున్న మహిళ మెడలో నాలుగున్నర తులాల బంగారు నల్లపూసల తాడు తెంచి పరారయ్యాడు.

చోరీ సొత్తు ఏం చేశాడంటే..

దొరికిన చోరీ సొత్తును విశాఖలోని మురళీనగర్‌లో ముత్తూట్ ఫైనాన్స్, కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో కమల్‌నాథ్ తండ్రి భీమరశెట్టి శ్రీరామమూర్తి పేరు మీద తాకట్టు పెట్టాడు. వచ్చిన సొమ్మును తండ్రీకొడుకులిద్దరూ పంచుకున్నారు.

ఎక్కడెక్కడ చేశాడంటే..

కంచరపాలెం, అనకాపల్లి, విజయనగరం టూటౌన్, శ్రీకాకుళం రూరల్, జామి, కొత్తవలస, ఆరిలోవ, అనపర్తి, ఎచ్చెర్ల, ఎయిర్‌పోర్టు, సబ్బవరం, గోపాలపట్నం పీఎస్‌ల పరిధిలో చోరీలు చేయగా 30 కేసులు నమోదయ్యాయి. ఇందులో పదిసార్లు నేరం రుజువై జైలుకెళ్లాడు.

వ్యసనాలకు బానిసై..

కమల్‌నాథ్ ఏడో తరగతి వరకే చదివి మధ్యలో ఆపేసి వ్యసనాలకు బానిసయ్యాడు. తండ్రికి మెకానిక్ షాపుండటంతో అక్కడే పనిచేసుకుంటూ తాళాలు లేకుండా వాహనాలు తీయడం నేర్చాడు. 2009 నుంచి బైక్‌లు, మహిళల మెడలో చైన్లు, ఆభరణాలు దొంగిలించేవాడు. ఈ క్రమంలో మొదటిసారి సామర్లకోట రైల్వే స్టేషన్ దగ్గర బైక్ దొంగిలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అరెస్టయి బయటకొచ్చాక మరిన్ని చైన్‌స్నాచింగ్‌లు చేశాడు.

ఓపెన్ విద్య.. అంతా మిథ్య

ప్రైవేటు స్టడీ సెంటర్ మంజూరు కోసమని లంచం తీసుకుంటూ అనకాపల్లి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్‌ను ఇటీవల ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సార్వత్రిక విద్యలో జరుగుతున్న అక్రమాలకు ఈ ఉదంతం ఓ ఉదాహరణ.

నగరంలో శ్రీనగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీకి ఇంటర్ బోర్డు నుంచి గుర్తింపు లేదు. అయితే ఈ కాలేజీ కోడ్‌తో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు తీసుకున్నారు. విషయం ఆలస్యంగా తెలుసుకున్న విద్యాశాఖాధికారులు.. దీన్ని ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ నుంచి తొలగించారు. కానీ సప్లిమెంటరీ పరీక్షలకు ఆ కాలేజీ పేరుతో విద్యార్థులు హాజరవుతుండటం గమనార్హం.

ఇదీ జిల్లాలో సార్వత్రిక విద్యా విధానం అమలు పరిస్థితి..


విశాఖలోని ఓ స్టడీ సెంటర్‌లో తరగతులకు హాజరైన విద్యార్థులు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 80 స్టడీ సెంటర్లు
- ఏటా ఐదు వేల మందికి పైగా విద్యార్థుల చేరిక
- పాస్ గ్యారెంటీ పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు
- గుర్తింపు లేని కేంద్రాల్లోనూ అడ్మిషన్లు
- ఏసీబీ ట్రాప్‌తో బాగోతం బట్టబయలు

విశాఖ విద్య: అనివార్య కారణాలతో చదువులు మధ్యలోనే ఆపేసిన వారు 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఓపెన్ స్కూల్ సొసైటీ ఏర్పాటు చేసింది. గుర్తింపు పొందిన స్టడీ సెంటర్ల ద్వారా ఏటా ప్రవేశాలు కల్పించి వార్షిక పరీక్షలు నిర్వహిస్తోంది. రెగ్యులర్ కోర్సులతో సమాన గుర్తింపు ఉండటంతో ఓపెన్ విధానంలో టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. విశాఖ జిల్లాలో 17, అనకాపల్లిలో 33, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 30 స్టడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఏటా ఐదు వేలకు పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందుతుండగా, అనకాపల్లి జిల్లా నుంచే ఎక్కువ మంది చేరుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో అనకాపల్లిలో జిల్లాలో 19 ప్రైవేట్ సెంటర్లు నిర్వహిస్తున్నారు.

తరగతుల నిర్వహణపై శ్రద్ధ ఏదీ?

ఓపెన్ స్కూల్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఫోకస్ పెట్టారు. స్టడీ సెంటర్ల నిర్వాహకుల పెత్తనాన్ని తగ్గించేలా ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చారు. పాఠ్య పుస్తకాలను సకాలంలో నేరుగా విద్యార్థుల ఇళ్లకే పోస్ట్ ద్వారా పంపించి, తరగతుల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారు. కానీ ఈ ఏడాది తరగతుల నిర్వహణ సవ్యంగా సాగడం లేదు. 2024–25 విద్యా సంవత్సరానికి సార్వత్రిక విద్యా విధానంలో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. పలు దఫాలు గడువు పెంచిన అధికారులు.. చివరి అవకాశం అంటూ ఈ నెల 25 వరకు ప్రవేశాలు పొందవచ్చని ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. షెడ్యూల్ మేరకు 30 తరగతులు నిర్వహించాలి. కానీ ఇప్పటికే చేరిన వారిని పరీక్షలకు సన్నద్ధం చేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

అడిగినంత ఇవ్వాల్సిందే..

ఓపెన్ స్కూల్స్‌లో ఇంటర్మీడియెట్‌కు జనరల్ కేటగిరీ వారైతే రూ.1,400, రిజర్వేషన్ అభ్యర్థులకు రూ.1,100లు ఫీజుగా చెల్లించాలి. టెన్త్‌కు జనరల్ వారికి రూ.1,300, రిజర్వేషన్ ఉన్న వారు రూ.900 చెల్లించాల్సి ఉంటుంది. ప్రవేశం పొందే అభ్యర్థులు నేరుగా ఆన్‌లైన్ విధానంలో ఫీజు చెల్లించవచ్చు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వివిధ శాఖల్లో పని చేసే చిరుద్యోగులు ఈ కోర్సుల్లో ఎక్కువగా చేరుతున్నారు. దీంతో కొన్ని ప్రవేట్ స్టడీ సెంటర్ల నిర్వాహకులకు పాస్ గ్యారెంటీ పేరుతో నిర్దేశిత ఫీజు కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. గత వార్షిక పరీక్షల సమయంలో విశాఖ జిల్లాలోని భీమునిపట్నం కేంద్రంలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ స్క్వాడ్ టీమ్‌కు పట్టుబడటం ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది.

తరగతుల నిర్వహణపై దృష్టి

షెడ్యూల్ మేరకు తరగతులు నిర్వహించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. పుస్తకాలు నేరుగా విద్యార్థుల ఇళ్లకే పోస్ట్ ద్వారా చేరుతాయి. సర్టిఫికెట్లు కూడా విద్యార్థుల ఇంటి చిరునామాకు పంపిస్తున్నాం.

–మురళీ మోహన్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, విశాఖ జిల్లా

విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం


4 వికెట్లు తీసిన విశాఖ బౌలర్ ప్రఖ్యాత్ వర్మ

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో తొలి రోజు వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కాగా, రెండోరోజు ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 51.3 ఓవర్లలో 196 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ప్రణవ్‌శ్రీరామ్ 47, ప్రఖ్యాత్‌వర్మ 39 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు రక్షణ్‌సాయి 4, ఆశిష్ రెడ్డి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 35.2 ఓవర్లలో 35 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని సాయిచరణ్ 10 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు ప్రఖ్యాత్‌వర్మ 4, లోహిత్‌రాఘవేంద్ర 3 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్‌డ్రాగా ముగిసింది. విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

రేషన్ డీలర్లకు మళ్లీ నోటీసులు

మహారాణిపేట: రేషన్ డిపోల విభజన ప్రక్రియ తలనొప్పిగా మారింది. 1,200 కార్డుల కంటే ఎక్కువగా ఉంటే రేషన్ డిపోల డీలర్ల నుంచి తీసుకున్న అభ్యంతరాలను రద్దు చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ నిర్ణయించారు. మళ్లీ సోమవారం నుంచి 68 మంది డీలర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించడానికి వీలుగా నోటీసులు జారీ చేశారు. నగర పరిధిలో 57 షాపులు, గ్రామీణ ప్రాంతాల్లో 11 షాపులు ఉన్నాయి. జిల్లాలో రేషన్ షాపుల హేతుబద్ధీకరణ కోసం పౌరసరఫరాల శాఖ సన్నాహాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కొత్తగా 68 రేషన్ షాపుల ఏర్పాటుకు ఆ శాఖ నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డీలర్లు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు గతంలో డీలర్లను నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. తదనంతరం జరిగిన పరిణామాలతో మళ్లీ వారికి నోటీసులు జారీ చేశారు. వీటికి పది రోజుల్లో డీలర్లు సమాధానం ఇవ్వాల్సి ఉందని డీఎస్‌వో వి.భాస్కరరావు తెలిపారు.

భారత్ నివేష్ రన్‌కు విశేష స్పందన


బీచ్ రోడ్డులో పరుగు తీస్తున్న నగర పౌరులు

ఏయూక్యాంపస్: అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా(ఏఎంఎఫ్ఐ) ఆధ్వర్యంలో మ్యూచువల్ ఫండ్స్‌పై అవగాహన పెంచేందుకు భారత్ నివేస్ రన్ నిర్వహించారు. బీచ్‌రోడ్డులో ఆదివారం ఉదయం 5 కిలోమీటర్ల పరుగును ఏఎంఎఫ్ఐ ప్రతినిధి వెంకటేష్ చలసాని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెబి ఆధ్వర్యంలో భారత్ నివేష్ రన్ రెండో ఎడిషన్ ప్రారంభించామన్నారు. ప్రపంచ పెట్టుబడిదారుల వారోత్సవాలను అక్టోబర్ 14–20 వరకు మన దేశంలో జరుపుకుంటామన్నారు. భారత్ నివేష్ రన్‌ని విశాఖతో పాటు చండీగఢ్, బెలగావి, జోద్పూర్, జంషెడ్‌పూర్‌లలో నిర్వహిస్తున్నామన్నారు. మ్యూచువల్ ఫండ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, చిన్న నగరాలలో ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. విశాఖలో నిర్వహించిన భారత్ నివేష్ రన్‌లో 3,800 మందికి పైగా పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గంతో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం చైరపర్సన్ లక్ష్మి

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ జేఏసీ అమరావతి మహిళా విభాగం విశాఖ డివిజనల్ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం విశాఖ కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఏపీ అమరావతి జేఏసీ మహిళా విభాగం విశాఖపట్నం శాఖ చైర్‌పర్సన్ శైలజ అధ్యక్షత వహించారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పారె లక్ష్మి, కో చైర్‌పర్సన్ విద్య, జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర వైస్ చైర్మన్ డి.జె. ప్రసాద్ ఆధ్వర్యంలో విశాఖ డివిజనల్ శాఖ 8 మందితో ఏర్పాటు చేశారు. విశాఖపట్నం డివిజన్ చైర్‌పర్సన్‌గా బి.శ్రీలత (రెవెన్యూ), అసోసియేట్ చైర్‌పర్సన్‌గా జి.కుమారి (ఆర్‌టీసీ), ప్రధాన కార్యదర్శిగా వి.రమ్యఅనూష (గ్రామీణ నీటి సరఫరా), కోశాధికారిగా ఈ.ప్రసన్న (సివిల్ డిఫెన్స్), ఇద్దరు కో చైర్ పర్సన్లు, ఇద్దరు సెక్రటరీలను ఎన్నుకున్నారు. భీమిలి డివిజన్ ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామని జిల్లా చైర్మన్ నాగేశ్వరరెడ్డి తెలిపారు.

• పచ్చని గిరులపై మేఘాల పల్లకి


పచ్చని చెట్లతో నిండి ఉన్న కొండలు.. ఆ కొండలపై తేలియాడుతున్న మేఘాలు.. మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. సింహాచలం కొండవాలు ప్రాంతంలో తీసిన ఈ చిత్రం.. ప్రకృతి అందం, మేఘాల అద్భుతం, మనిషి నిర్మించిన అందమైన నిర్మాణాల మిశ్రమం. ఈ ప్రాంతంలోని ప్రశాంత వాతావరణం, అద్భుతమైన దృశ్యాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. – ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

డాబాగార్డెన్స్ : ప్రభుత్వ ఆధీనంలో విద్య ఉండడం ద్వారానే సమాజంలో నైతిక విలువలు, ప్రజాతంత్ర హక్కులు నిలబెట్టుకోగలమని, ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు సూచించారు. యూటీఎఫ్ విశాఖ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వేంకటేశ్వర్లు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాటం చేసిందని, పాలకవర్గాల నిర్బంధాలను, కేసులను తట్టుకుని నిలబడిందని తెలిపారు. ప్రభుత్వ బడిని బతికించుకోవడానికి బడి సమయం కంటే అదనంగా ఒక గంట పని చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహనరావు, ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపనలో జీవితాలు పణంగా పెట్టిన అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటూ భవిష్యత్ ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. ట్రైబల్, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. యూటీఎఫ్ జెండాను పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాగమణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి, టి.ఆర్.అంబేడ్కర్, పైడిరాజు, ఎన్, ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, కె, రాంబాబు, చుక్క సత్యం, ఉప్పాడ రాము, మహ్మద్ రిజ్వాన్, రియాజ్ అహ్మద్, టి. జగన్, వంగా రామలక్ష్మి, ఎం. రవిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టి.ఆర్.అంబేడ్కర్‌తో పాటు పలువుర్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిరాహార దీక్షలు విరమించిన ఎన్ఎంయూ


డీపీటీవో అప్పలనాయుడితో చర్చలు జరుపుతున్న ఎన్ఎంయూ ప్రతినిధులు


ఎంవీపీకాలనీ: వాల్తేరు డిపో ఆవరణలో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కొంత కాలంగా చేస్తున్న నిరాహార దీక్షలను ఆదివారం విరమించింది. ఈ మేరకు అసోసియేషన్ వాల్తేర్ డిపో కార్యదర్శి వసంతరావు ఓ ప్రకటనలో తెలిపారు. నూతన డీపీటీవో అప్పలనాయుడితో అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం జరిపిన చర్చలు ఫలించిన నేపథ్యంలో దీక్షలు విరమించినట్లు వెల్లడించారు. గత డీపీటీవో అప్పలరాజు ఉద్యోగులపై అణచివేత వైఖరి కారణంగా అనేక సమస్యలు తలెత్తినట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి పలువురు ఉద్యోగులను ఆయన ఇబ్బందులకు గురిచేసినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం దృష్ట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో 45 రోజులుగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని.. నూతన డీపీటీవోతో జరిపిన చర్చల్లో సానుకూల పరిష్కారంతో కూడిన హామీ లభించిందన్నారు. ఈ నేపథ్యంలో దీక్షలు విరమించినట్లు వసంతరావు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి దీక్షలో పాల్గొన్న ఉద్యోగులకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. చర్చల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పి.వి.వి.మోహన్, జిల్లా కార్యదర్శి నీలకంఠం, డివిజన్ అధ్యక్షుడు వీఎస్ఆర్ మూర్తి, కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అమరావతితో సమానంగా విశాఖను అభివృద్ధి చేయాలి


సీఎంకు రాసిన లేఖను చూపుతున్న గోవిందరావు

ఎంవీపీకాలనీ: అమరావతితో సమానంగా విశాఖపట్నాన్ని కూటమి ప్రభుత్వ అభివృద్ధి చేయాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అన్ని విధాల అభివృద్ధి దిశగా పయనించాలంటే అందుకు విశాఖపట్నం పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా అంతర్జాతీయ నగరంగా ఎదగడం ఒక్కటే మార్గమన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అమరావతికి దీటుగా విశాఖ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాసినట్లు వెల్లడించారు. ఆదివారం ఎంవీపీ కాలనీలో జరిగిన కార్యాలయంలో సీఎంకు పంపించిన లేఖను ఆయన ప్రదర్శించారు. పలువురు సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

29 నుంచి ఆరోగ్య మిత్రల నిరవధిక సమ్మె


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్య శ్రీ) పథకం ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదరోగులకు సేవలు అందిస్తున్న ఫీల్డ్ సిబ్బందికి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఈనెల 29 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయనున్నట్టు ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ తెలిపారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న గుంటూరులో ఎన్టీఆర్ వైద్య సేవ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో లక్ష్మీషాకు రాష్ట్ర నాయకులు సమ్మె నోటీస్ ఇచ్చారని చెప్పారు. ఆరోగ్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, జిల్లా మానటరింగ్‌కేడర్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. దీంతో సమ్మె చేసేందుకు సిద్ధమైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.కనకం, సంఘం గౌరవాధ్యక్షుడు వై. ఎన్.భద్రం, జిల్లా నాయకులు సోమేష్, దుర్గాప్రసాద్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


అనుమానిత ఇళ్లల్లో విస్తృతంగా సోదాలు


- నంబర్ ప్లేట్లు, రికార్డులు లేని వాహనాల స్వాధీనం
- ఫోర్త్‌టౌన్, గాజువాక స్టేషన్ల పరిధిలో కార్డన్ సెర్చ్


గాజువాక పరిధిలో స్వాధీనం చేసుకున్న బైక్‌లు

సీతమ్మధార/అక్కిరెడ్డిపాలెం: నగరంలో పెచ్చురిల్లుతున్న అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికల కట్టడికి ఆదివారం ఫోర్త్‌టౌన్, గాజువాక పోలీస్ బృందాలు భారీ ఎత్తున కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించాయి. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు డీసీపీ–1 అజిత వేజెండ్ల, తూర్పు ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఫోర్తుటౌన్ సీఐ ఎస్.విజయకుమార్ తన సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. వరహాగిరినగర్, కైలాసపురం, సత్యసాయినగర్, సాలిగ్రామపురం, సింహగిరి కాలనీ, లెప్రసీ కాలనీ, ఎంఈఎస్ ప్రాంతాల పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. జోన్–1 కు సంబంధించి 110 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది 62 బృందాలు, 35 సెర్చ్ టీమ్స్, 11 కటాఫ్ టీమ్స్, 16 లిఫ్టింగ్ టీమ్‌లుగా విడిపోయి అణువణువూ సోదాలు చేశారు. 26 అనుమతుల ఇళ్లతో పాటు 45 ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. నంబర్లు ప్లేట్లు, రికార్డులు లేని 26 వాహనాలను స్వాధీనం చేశారు. గాజువాక పరిధిలో 50 మంది పోలీసులు 25 బృందాలుగా విడిపోయి పలు ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఎటువంటి పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్డన్ సెర్చ్‌లో గాజువాక సీఐ ఎ.పార్థసారథి, ఎస్ఐలు మన్మథరావు, రాధాకృష్ణ, సూర్యకళ, సిబ్బంది పాల్గొన్నారు.

లారీకి బైక్ హ్యాండిల్ తగిలి మహిళ మృతి


ఘటనా స్థలంలోనే మృతి చెందిన సంతోషి


సంఘటన స్థలంలో రోదిస్తున్న మృతురాలి భర్త ఈశ్వరరావు

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై లారీ ఢీకొని మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా... బర్మాక్యాంపు ప్రాంతానికి చెందిన ఈశ్వరరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య సంతోషి (36)తో కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం ఓ శుభకార్యం నిమిత్తం మధురవాడ బయలుదేరాడు. ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద అక్కయ్యపాలెం నుంచి వస్తున్న లారీ.. బైక్ హ్యాండిల్‌కు తగలడంతో భార్యాభర్తలు తూలిపోయి జాతీయ రహదారిలో చెరో దిక్కుగా పడిపోయారు. సంతోషి తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు, ఎస్ఐ వాణిశ్రీ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. లారీ డ్రైవర్ కోన అప్పలరాజును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పుట్టపర్తికి మాడుగుల హల్వా


ప్రత్యేక వాహనంలో మాడుగుల హల్వాను పుట్టపర్తికి తీసుకు వెళుతున్న భక్తులు

మాడుగుల: పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరగనున్న పర్తియాత్రలో పాల్గొనున్న సత్యసాయిబాబా భక్తులకు మాడుగుల హల్వాను ప్రసాదంగా అందజేయనున్నారు. ఈమేరకు స్థానిక భక్తులు హల్వాతో ఆదివారం పుట్టపర్తికి పయనమయ్యారు. సాయి గాయత్రీ పారాయణం చేస్తూ ప్రత్యేక వాహనంలో హల్వాను తీసుకుని స్థానిక భక్తులు బయలుదేరారు.